క్లుప్తంగా

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మెప్మా స్టాల్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల విక్రయానికి 28వ వార్డులో ఏర్పాటు చేసిన 30 స్టాల్స్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్ ఆసరా, చేయూత తదితర పథకాల సద్వినియోగం ద్వారా మహిళల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున, మెప్మా టీపీఆర్ఓ మోహన్, సీఎంఎం.భవానీ, మాజీ చైర్మన్‌లు రామలింగప్ప, రామాంజినేయులు, సీఓలు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

గుత్తి: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయ ఢంకా మోగించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గుత్తి లో సోమవారం సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్. శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు ఓబుళయ్య, నారాయణరెడ్డి, తిమ్మారెడ్డి, మూలింటి బాలకృష్ణ తదితరులు గాంధీ సర్కిల్ వద్దకు చేరుకుని బాణాసంచా కాల్చారు. మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. జై బీజేపీ, జైజై మోదీ అంటూ నినాదాలు చేశారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బీజేపీ విజయం సాధిస్తుందని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు.

మరుగుదొడ్లను వినియోగించుకోండి



సామూహిక మరుగుదొడ్డిని ప్రారంభిస్తున్న దృశ్యం

యాడికి: సామూహిక మరుగుదొడ్లను ప్రజలు, ప్రయాణికులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, గ్రామ సర్పంచ్ అనూరాధ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో దాదాపు రూ.3.5 లక్షలతో నిర్మించిన సామూహిక మరుగు దొడ్డిని ప్రారంభించారు. కార్యక్రమంలో యాడికి ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు,ఈఓ ఎర్రిస్వామి, ఎంపీటీసీలు వెంకటనాయుడు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


యానాది కులస్తులకు ఆధార్‌కార్డుల మంజూరు



ఆధార్‌కార్డులు అందజేస్తున్న దృశ్యం

శింగనమల: మండలంలోని తరిమెల గ్రామంలో నివసిస్తున్న యానాది కులస్తులకు ఎటువంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు తరిమెల వంశీగోకుల్ రెడ్డి, సర్పంచ్ ఓబిలేసు ఇటీవల వారికి ఆధార్ కార్డులు తీయించారు. సోమవారం వారికి ఆధార్‌కార్డులు మంజూరు కావడంతో అందజేశారు. రేషన్‌కార్డు మంజూరు చేయించి, పథకాలు అందేలా చూస్తామని నాయకులు తెలిపారు.

అయ్యప్ప, శివభక్తులకు భిక్ష



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప, శివ దీక్షపరులకు సోమవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా 45 రోజుల పాటు మాలదారులకు ఉచితంగా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. మాలధారులు భక్తితో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సుమారు 600 మంది అయ్యప్ప, శివమాలధారులు పాల్గొన్నారు.

నవరత్నాలతో సంక్షేమ కాంతులు



తాడిపత్రి పట్టణం అంబేడ్కర్ నగర్ సచివాలయంలో పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దూదేకుల బాబయ్య



యాడికి మండల కేంద్రంలోని 1వ వార్డులో పథకాల బుక్‌లెట్ అందిస్తున్న నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి



బుక్కరాయసముద్రంలో మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

- జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలి
- వై ఏపీ నీడ్స్‌లో ప్రజాప్రతినిధుల పిలుపు

తాడిపత్రి అర్బన్: ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకుందామని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దూదేకుల బాబయ్య కోరారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ నగర్ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయం సిబ్బంది, వలంటీర్లు ప్రజల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం జగన్ నెరవేర్చారని పేర్కొన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యే పెద్దారెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రాజు ఆధ్వర్యంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ పల్లె నాగేశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, సాంబశివారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తలారి రంగడు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

యాడికి: జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి కోరారు. సోమవారం నగరూరు సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు మండల కేంద్రంలోని 1వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగ క్షేమాలను అడిగి తెలుసు కున్నారు. వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, యాడికి, నగరూరు, తూట్రాళ్లపల్లె, లక్షుంపల్లె సర్పంచులు అనూరాధ, రుక్మాందర రెడ్డి, సంజీవ రాయుడు, పద్మనాభ రెడ్డి, యాడికి ఉప సర్పంచు కాసా చంద్ర మోహన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీలు వెంకటనాయుడు, రామ్మోహన్ పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని గోవిందపల్లి సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. గోవిందపల్లి సచివాలయ పరిధిలో రూ.29.18 కోట్ల లబ్ధి చేకూరిందని ప్రజాప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరి రమణారెడ్డి, సర్పంచ్ రాములమ్మ, ఎంపీటీసీ ఎర్రినాగప్ప, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, అంకే మునలన్న, ఈఓఆర్డీ దామోదరమ్మ, అంకే సురేష్ పాల్గొన్నారు.

నార్పల: రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని సిద్ధరాచర్ల గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగేశ్వరావు, సర్పంచ్ రామాంజనేయులు, ఎంపీటీసీ శంకర్‌యాదవ్, రవీంద్రా రెడ్డి, మాదవ్‌రెడ్డి, శివయ్య, చంద్రశేఖర్, సూరప్ప తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండాయి. రాష్ట్రంలో పేదరికం పూర్తిగా నిర్మూలన జరగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని తెలిపారు. సోమవారం 10, 28 వార్డుల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌన్సిలర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో 10వ వార్డు సచివాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ విజయలక్ష్మి, వార్డు ఇన్‌ఛార్జ్ ఎద్దుల శంకర్, కోఆప్షన్‌సభ్యుడు రాజశేఖర్, జేసీఎస్ కన్వీనర్లు రామాంజనేయులు, ఖలీల్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండల పరిధిలోని మేడిమాకులపల్లి సచివాలయం వద్ద వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ చితంబరరెడ్డి, ఈఓపీఆర్డీ నాగేశ్వరశాస్త్రి మాట్లాడుతూ.. ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం నాలుగున్నర ఏళ్లలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, రామన్న, సిబ్బంది, గృహసారథులు, పాల్గొన్నారు.



తాడిపత్రి మండలం సజ్జలదిన్నెలో..



నార్పల మండలం సిద్ధరాచర్లలో జెండా ఆవిష్కరణ



గుంతకల్లు 10వ వార్డులో పథకాల బోర్డు ఆవిష్కరణ



పెద్దవడుగూరు మండలం మేడిమాకులపల్లిలో..

'స్పందన'కు 8 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

యల్లనూరు: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సుమతి తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 8 వినతులు వచ్చాయన్నారు. కల్లూరులో దేవాలయ ఆధునీకరణకు ఒక్కటి, మిగిలిన అర్జీలు భూమి ఆన్‌లైన్ కోసం అందినట్లు తెలిపారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో వార్డన్ వెంకటేశ్వర్లు, ఐకేపీ ఏపీఎం ముత్యాలప్ప, హౌసింగ్ ఏఈ సుప్రజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజామణి తదితరులు పాల్గొన్నారు.

రోశయ్యకు ఘన నివాళి



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అవోపా నాయకులు

గుంతకల్లు: పట్టణ అవోపా ఆధ్వర్యంలో సోమవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రానికి, ఆర్యవైశ్యులకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అవోపా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు, కూలీలను ఆదుకోండి

శింగనమల: వర్షాభావ పరిస్థితుల్లో నష్టపోయిన రైతులు, కూలీలను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీగా వచ్చి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు లక్ష్మీ రంగయ్య, నాగప్ప, శ్రీనివాసులు, రవిశంకర్, రామదాసు, మాజీ సర్పంచులు ఆదినారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సామాజిక న్యాయం



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

- 9న గుంతకల్లులో సామాజిక సాధికార యాత్ర
- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: దేశచరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి చేశారు. సామాజిక న్యాయం అనేది తమ నినాదం కాదని, తమ విధానమని నిరూపించిన ఏకైక సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. సీఎం జగనన్న పాలనలో బడుగు, బలహీన వర్గాలకు జరిగిన మంచిని వివరించడానికి ఈనెల 9వ తేదీన గుంతకల్లులో సామాజిక సాధికార యాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు దేరంగుల ఉదయ్‌కిరణ్ తయారు చేయించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని వర్గాలు కలకాలం సంతోషంగా ఉంటూ, అన్ని రంగాల్లో రాణించాలంటే మళ్లీ జగనే సీఎం కావాలన్నారు. 9న జరిగే సామాజిక సాధికార బస్సుయాత్రకు నియోజకవర్గం నుంచి వేలాది సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సాధికారత యాత్ర స్టిక్కర్లను ఆటోలకు అతికించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రామలింగప్ప, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, కౌన్సిలర్లు ప్రభాకర్, రవి, నాయకులు నూర్‌నిజామి, మార్కెట్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మండల ఇంజినీర్‌పై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ రమేష్‌రెడ్డి

గుంతకల్లు రూరల్: ప్రభుత్వం నుంచి మంజూరైన సిమెంట్‌ను కాజేయడమే కాకుండా అదేమని అడిగిన ప్రజాప్రతినిధులపై బెదిరింపులకు పాల్పడుతున్న మండల ఇంజినీర్ ఓబులేసుపై చర్యలు తీసుకోవాలని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి కోరారు. సోమవారం తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. బాధితులు శ్రీనివాసులు, ఆదినారాయణతో కలిసి మాట్లాడారు. ఓబుళాపురం పంచాయతీలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం భవనాలను ప్రభుత్వం నిర్మించడం జరిగిందన్నారు. నిర్మాణ పనుల్లో భాగంగా అందాల్సిన 650 బస్తాల సిమెంటును మండల ఇంజినీర్ ఓబులేసు కాజేశారని తెలిపారు. ఈ విషయంపై ఇంజినీర్‌ను ప్రశ్నించగా నువ్వు నన్నేమీ చేసుకోలేవని, నీకు ఇష్టం వచ్చిన వారితో చెప్పుకో అంటూ బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడితో ఆగకుండా నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు రాకుండా నిలిపేశారని తెలిపారు. నెలగొండ గ్రామంలో 2021 సంవత్సరంలో ఆదినారాయణ అనే కార్యకర్త చేపట్టిన సీసీ రోడ్డు పనిలో అతడికి తెలియకుండా 560 బస్తాలు, శ్రీనివాసులు అనే కార్యకర్తకు తెలియకుండా 240 బస్తాలు కాజేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి



యాడికిలో ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

యల్లనూరు/యాడికి/గుంతకల్లు రూరల్/శింగనమల/తాడిపత్రిటౌన్: యల్లనూరు కోటా పాఠశాలలోని ఐఈఆర్టీ సెంటర్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఆర్డీటీ ఆర్గనైజర్ నాగరాజు, ఎంఈఓ చంద్రశేఖర్, హనుమాన్ వికలాంగుల మండల సమాఖ్య లీడర్లు ఓబులేసు, జాఫర్, ఐఈఆర్టీ రాధికతో కలిసి ప్రతిభావంతుల పిల్లలకు బహుమతులు అందించారు. యాడికి మండల కేంద్రంలో శ్రీవేంకటేశ్వర మండల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కదిరప్ప నాయుడు ఆధ్వర్యంలో దివ్యాంగులు ర్యాలీ చేపట్టారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి బొంబాయి రమేష్ నాయుడు నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలమ్మ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంఈఓ కాశెప్ప, ఎంపీటీసీలు వెంకటనాయుడు, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, నాగరాజు, రామ్మోహన్, జేసీఎస్ మండల కన్వీనర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గుంతకల్లులోని మోదినాబాద్ లాల్‌బహదూర్ శాస్త్రి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో దివ్యాంగుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు పాల్గొన్నారు. శింగనమలలోని ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి దివ్యాంగులతో కలిసి ఎంపీడీఓ నిర్మలాకుమారి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఎస్‌టీఎల్ ఇందిరప్రసన్న, దివ్యాంగుల సంఘం నాయకులు తరిమెల నారాయణ, నారాయణస్వామి పాల్గొన్నారు. తాడిపత్రి పట్టణంలోని భవిత కేంద్రంలో విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు రామగోవింద్ రెడ్డి, రాధాకృష్ణ, రామచంద్రారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉనికి కాపాడుకునేందుకే జేసీ డ్రామాలు'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడిపత్రిటౌన్: తాడిపత్రిలో టీడీపీ ఉనికిని కాపాడుకునేందుకే జేసీ ప్రభాకర్‌రెడ్డి రాజకీయ డ్రామాలు ఆడుతున్నారు. టిడ్కో ఇళ్ల ముట్టడి కార్యక్రమంలో నీ అనుచరులు తప్పా ఒక్కరైనా టిడ్కో లబ్ధిదారులు ఉన్నారా అని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడు గంగులకుంట కేశవరెడ్డి ప్రశ్నించారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాడిపత్రిలో నిత్యం అల్లర్లు అలజడులు ప్రేరేపించేలా జేసీ ప్రభాకర్‌రెడ్డి నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. 2015లో ప్రారంభమైన టిడ్కో ఇళ్ల నిర్మాణాలను టీడీపీ హయాంలో ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు నిలిపివేస్తే జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక దాదాపు 2 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారని తెలిపారు. వచ్చే జనవరి నెలలో లబ్ధిదారులకు ఇచ్చేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

దళితులను అవమానిస్తే ఊరుకోం

దళితులను అవమానిస్తే ఊరుకునేది లేదని ఎమ్మార్పీఎస్ నాయకుడు గురుశంకర్ అన్నారు. నీ దగ్గర ఉన్న మా సోదరి కమలమ్మ విషయంలో నోరు జారవద్దని హెచ్చరించారు. సోషల్ మీడియాలో కమ్మలమ్మను అవమాన పరిచేలా జరక్క పోతాంది.. అని మాట్లాడటం సరికాదన్నారు. 200 ఎకరాల భూమిని రైతులతో కొనుగోలు చేస్తా అని పదేపదే చెబుతున్నావన్నారు. ఆ భూమి వైఎస్సార్ హయాంలో ఇందిరమ్మ ఫస్ట్‌ఫేజ్ కింద 2008లో 125.28 ఎకరాలు మాత్రమే కొనుగోలు చేశామన్నారు. అదీ కూడా సోషల్‌వెల్ఫేర్ కింద భూమిని ప్రభుత్వం కొనుగోలు చేస్తే అనుచరులతో కొనుగోలు చేయించావని తెలిపారు. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి ఎక్కువ మొత్తానికి ఇప్పించిదే కాకుండా నీ అనుచరులైన షిలాస్‌కు, డ్రైవర్‌కు రైతుల పేర్లతో ముందు భాగంగాలో 5 సెంట్లు ఇప్పించి మోసం చేశావని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం టౌన్ ప్రెసిడెంట్ మనోజ్‌కాశి, ఎమ్మార్పీఎస్ నాయకులు క్రిష్ణయ్య, వక్స్‌బోర్డ్ సెక్రటరీ బాబా, సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోటాపోటీగా రాష్ట్రస్థాయి భజన పోటీలు

గార్లదిన్నె: మండల పరిధిలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించారు. భజన పోటీల్లో మొత్తం 14 భజన బృందాలు పాల్గొన్నాయి. ముకుందాపురానికి చెందిన ప్రసన్న ఆంజనేయ స్వామి, గుత్తి ఆర్ఎస్‌కు చెందిన లక్ష్మీనరసింహస్వామి భజన బృందాలు మొదటి స్థానంలో నిలిచాయి. లక్ష్మంపల్లికి చెందిన శివ రామాంజనేయులు భజన బృందం రెండో స్థానం, నార్పలకు చెందిన కోదండ రామస్వామి భజన బృందం మూడో స్థానంలో నిలిచాయి. మరూరుకు చెందిన చిన్న కదిరెప్ప స్వామి భజన బృందం నాలుగో స్థానం, చెర్లోపల్లికి చెందిన సిద్ధ రామలింగేశ్వర స్వామి భజన మండలి ఐదో స్థానం, వడ్డిపల్లికి చెందిన చంద్రమౌళీశ్వర స్వామి భజన బృందం, పామిడికి చెందిన దత్తాత్రేయ స్వామి భజన బృందం ఆరో స్థానంలో నిలిచాయి. అనంతరం భజన పోటీల్లో గెలుపొందిన బృందాలకు నగదు బహుమతులు అందజేశారు.

మహిళకు తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి గ్రామ సమీపంలో సోమవారం వై.జంక్షన్ వద్ద లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురానికి చెందిన మల్లేశ్వరి కర్నూలు నుంచి అనంతపురానికి కారులో బయలు దేరింది. అయితే గుత్తి పట్టణ శివారులో లారీని ఢీకొట్టడంతో గాయపడిన మల్లేశ్వరిని వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




పామిడిలో పాలపొంగుల ఉత్సవం



గుత్తిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీకం.. భక్తుల పరవశం

గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లోని ఆలయాల్లో సోమవారం కార్తీక వేడుకలు ఘనంగా జరిగాయి. గుత్తిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో జరిగిన కోటి దీపోత్సవంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుంతకల్లు బుగ్గ సంగమేశ్వర, పామిడిలోని భోగేశ్వరాలయంలో విశేష పూజలు జరిగాయి. తాడిపత్రిలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయం తెల్లవారుజాము నుంచే భక్తులతో కిక్కిరిసిపోయింది. చిన్నపెప్పూరులోని అశ్వత్థ నారాయణస్వామిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పుట్లూరు మండలం శనగలగూడూరులో పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. – సాక్షినెట్‌వర్క్:



గుంతకల్లు బుగ్గ సంగమేశ్వరుడి ఆలయంలో..



అలంకరణలో చక్ర భీమలింగేశ్వరుడు



పుష్పాలంకరణలో బుగ్గ రామలింగేశ్వరుడు

తాగునీటి సమస్య పరిష్కారం

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరు ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పోలీసులు పరిష్కరించారు. గ్రామంలో నెలకొన్న వివాదాన్ని పరిష్కరించేందుకు ఈనెల 2న డీఎస్పీ వెంకటశివారెడ్డి ఇతర అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించిన విషయం విధితమే. ఈ సమయంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు ఎస్సీ కాలనీవాసులు పోలీసులకు విన్నవించారు. స్పందించిన ఎస్ఐ దిలీప్‌కుమార్ సోమవారం స్టాటర్, విద్యుత్ మోటార్‌కు మరమ్మతులు చేయించారు. అనంతరం తాగునీటి కోసం కుళాయిలను ఏర్పాటు చేయించడంతో సమస్య పరిష్కారమైంది.

ఘనంగా ఘంటసాల జయంతి

గుంతకల్లు: పట్టణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు.

గుత్తి: పట్టణంలోని శ్రీబాల సుబ్రహ్మణ్యం కల్చరల్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వర రావు జయంతి జరుపుకున్నారు. ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సొసైటీ సభ్యులు పాటలను పాడి అలరించారు.